క్లుప్తంగా

ఎంపీ అనురాధను కలిసిన అంజిబాబు



అంజిబాబును సత్కరిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: మొగళ్ళమూరులోని ఎంపీ నివాసంలో ఎంపీ చింతా అనురాధను రాష్ట్ర బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జిల్లా సేవాదళ అధ్యక్షులు మంగంపల్లి అంజిబాబు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంజిబాబుకి ఎంపీ అనురాధ శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీర్లకు అభినందనలు



వలంటీర్లను అభినందిస్తున్న కౌన్సిలర్లు రాజేష్, చంటి

అమలాపురం టౌన్: స్థానిక శ్రీరామనగర్ వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లకు ఆ సచివాలయంలో శనివారం అభినందన కార్యక్రమం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వలంటీర్లకు వందనం పురస్కారాలు స్వీకరించిన 21, 22 వార్డుల్లో పనిచేస్తున్న 18 మంది వలంటీర్లను సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన వార్డు కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, అబ్బిరెడ్డి చంటి మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్న నిరుపేద కుటుంబానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయం అందించారు. చొల్లంగి గ్రామానికి చెందిన నిరుపేద కూలీ మాతా జాన్ క్యాన్సర్ వ్యాధిన పడ్డాడు. వైద్యులు అతడి కుడిచేయిని తొలగించారు. దీంతో ఉపాధి లేక ఇంటి వద్దే ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శివన్నారాయణ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. జాన్‌కు రూ.10 వేల నగదు, బియ్యం బస్తా, కిరాణా సరకులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వరిపల్లి శివాజీ గణేష్, మాజీ సర్పంచ్ మాసా శ్రీనివాస్, నాయకులు కేబుల్ శ్రీను, వారా సూర్యకుమారి, దడాల సువర్ణలత, దిమ్మల జనార్ధన్, ద్రోణం సిద్ధార్థ కుమార్ పాల్గొన్నారు.

ఓటు బలమైన ఆయుధం



కాట్రేనికోనలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ వేసిన ముగ్గు

కాట్రేనికోన: ప్రజాస్వామ్య దేశాల్లో ఓటు బలమైన ఆయుధమని, ప్రభుత్వాల తల రాతను మార్చే శక్తి ఓటుకు ఉందని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సర్పంచ్ వెంకట సుధాకర్ అన్నారు. శనివారం కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఐకేపీ ఏపీఎం ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన సెర్ప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల శాఖ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ అర్హత ఉన్న యువతీయువకులంతా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రభుత్వానికే ఓటు వేసి మద్దతుగా నిలవాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తులసి, ఎల్‌వీ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాబేళ్ల పరిరక్షణపై అవగాహన సదస్సు

కాట్రేనికోన: పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్న తాబేళ్ల పరిరక్షణ, ఆవశ్యకతపై కందికుప్ప అటవీ సెక్షన్ వద్ద శనివారం అవగాహన సదస్సు జరిగింది. జిల్లాలో వాసాలతిప్ప, ఎస్.యానం, గచ్చకాయలపోర, సాక్రమెంట్ లైట్ హౌస్ ప్రాంతాల్లో తాబేళ్ల హేచరీల్లో పనిచేస్తున్న 16 మంది సిబ్బందికి వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు రాజశేఖర్, అపర్ణ, అర్పితారాయ్‌లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న జాతుల్లో ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లు ఉన్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అమలాపురం అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ హరికుమార్, డీఆర్ఓ వరప్రసాద్, సాయిబాబు పాల్గొన్నారు.

సత్తెమ్మ సన్నిధి.. కళలకు పెన్నిధి..



ఆకట్టుకున్న శక్తి వేషాలు



సత్తెమ్మ తల్లి అమ్మవారు



అలరించిన నృత్యాలు

- 50వ వార్షికోత్సవాల్లో సాంస్కృతిక శోభ
- నేడు అమ్మవారి తీర్థం

ముమ్మిడివరం: సిరుల తల్లి.. కల్పవల్లి.. భక్తుల పాలిట కొంగు బంగారం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి సన్నిధి కళలకు పెన్నిధిగా నిలిచింది. అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నాటకాలు, బుర్రకథలు, కూచిపూడి నాట్యం, జానపద గేయాలు, సంగీత విభావరిలు ఆద్యంతం కట్టి పడేస్తున్నాయి. అమ్మవారి 50వ వార్షికోత్సవ జాతర, తీర్థ మహోత్సవాలు గత నెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవపేతంగా జరగనున్నాయి. తీర్థ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి భారీ ఊరేగింపు జరగనుంది. ఈ ఉత్సవాల ద్వారా నాటక పరిషత్, నృత్య, జానపద, సంగీత, వాయిద్య కళాకారులను నిర్వాహకులు ప్రోత్సహిస్తున్నారు. ఉత్సవాల్లో సుమారు 2,000 మంది కళాకారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. 50వ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పాల్గొని 50 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఆరు రోజులుగా అమ్మవారి జాతర నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాలకు ఏర్పాటు చేశారు. బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ వివిధ వేషధారణలు, జానపద నృత్యాలు, గరగ నృత్యాలు, గిరిజన నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. అలాగే అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ సెట్టింగులతో మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని పెదగాడవిల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి గ్రామల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. పెదగాడవిల్లిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, ఉప్పలగుప్తంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన కల్వర్టును, రూ.15 లక్షలతో నిర్మించిన బాబూ జగజ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలును, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, మధురపేటలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన 40 కిలోలీటర్ల ఓహెచ్ఎస్ఆర్‌ను, రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును, రూ.38 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని, గొల్లవిల్లిలో రూ.1.49 కోట్ల నాబార్డ్ నిధులతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులను, మరుగుదొడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసి రైతులకు సకల సేవలు గ్రామాల్లోనే అందేలా చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్యలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఓహెచ్ఎస్ఆర్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక్క ఉప్పలగుప్తం లోనే మూడు కమ్యూనిటీ భవనాలను ఏర్పాటు చేశామని, వీటితో చిన్న తరహా ఫంక్షన్‌లకు వేల రూపాయలు అదనంగా ఖర్చు చేయకుండా వినియోగించుకోవచ్చన్నారు. ఉప్పలగుప్తంలో ఓహెచ్ఎస్ఆర్‌కు స్థల దానం చేసిన ఎంపీటీసీ సభ్యురాలు చిక్కం త్రినాథ, రైతు విభాగం మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం దంపతులను గ్రామస్తులు మంత్రి సమక్షంలో సత్కరించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ కేజ్రీవాల్, పవన్‌కల్యాణ్ ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. కేజ్రీవాల్ ఇప్పటికే రెండు సార్లు ముఖ్యమంత్రి పదవి చేపడితే, పవన్‌కల్యాణ్ మాత్రం చంద్రబాబు, అతని కొడుకు లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయడానికి జనసైనికులను తాకట్టు పెట్టేస్తున్నాడన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రానున్న రోజుల్లో జగనన్నను మళ్లీ సీఎం చేసి మీకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గుద్దటి మహాలక్ష్మి, కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గచిన్ని, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యిల రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, ఎంపీటీసీలు వంగా గిరిజాకుమారి, కొంకి ఏడుకొండులు, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పెదగాడవిల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్



ఉప్పలగుప్తంలో ఓహెచ్ఆర్ఎస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

విశ్వ బ్రాహ్మణ భవనం పైఅంతస్తుకు శంకుస్థాపన



సంఘ భవనం పైఅంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో ఉన్న పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘం భవనంలో పైఅంతస్తు నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ రూ.10 లక్షలు విడుదల చేయించారు. పైఅంతస్తు భవన నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారుల సామాజిక అవసరాలను తీర్చడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, స్థానిక వార్డు కౌన్సిలర్ రాజీ గోపి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, సంఘం ప్రతినిధులు దార్ల పెదబాబు, కట్టోజు సన్యాసిదాసు, తాళాబత్తుల లక్ష్మణరావు, ఓడూరి ఫణి, తాళాబత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

4న ఐటీఐలో జాబ్ మేళా

యానాం: పట్టణ పరిధిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ శనివారం తెలిపారు. స్పైడర్ ఎలక్ట్రిక్, ఓరియంట్ ఎలక్ట్రానిక్స్, ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, జీఆర్ అసోసియేట్స్, రుచితా అసోసియేట్స్ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. 5వ తరగతి, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో ఇన్ ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్ తదితర అర్హతలు గల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వస్త్రాలు పోగు చేసుకునే హక్కుకు టెండర్లు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులు సమర్పించే నూతన వస్త్రాలను పోగు చేసుకునే హక్కుకు రెండేళ్ల కాల పరిమితికి గాను శనివారం అధికారులు టెండర్లు నిర్వహించారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో షీల్డ్ టెండర్లు నిర్వహించారు. యానాంకు చెందిన మోటుపల్లి రామకృష్ణ అత్యధికంగా రూ.17,01,102కు టెండరు వేసి దక్కించుకున్నట్లు తెలిపారు. మొత్తం నలుగురు ఈ టెండర్‌లో పాల్గొన్నారన్నారు. గతసారి రూ.12,15,500కు టెండర్ ఖరారైతే ఈ దఫాలో దాని కంటే రూ.5,96,102 అధికంగా ఆదాయం వచ్చిందన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

తాళ్లరేవు: ఫార్మసిస్టులు ఔషధ రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియమ్స్ కేరి కోరారు. శనివారం కోరంగిలోని కోరింగా ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మూడో కంటిన్యూ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన సేవలందించేందుకు ప్రతి ఫార్మసిస్టు ఏడాదికి కనీసం రెండుసార్లు ఇటువంటి కార్యక్రమాలకు హాజరై కొత్త విషయాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ ప్రగ్గపాటి కనకరాజు, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు దుర్గా ప్రసాద్, ఎం.నాగేంద్ర కుమార్, కళాశాల చైర్మన్ దున్నా జనార్ధనరావు, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దైవానుగ్రహంతో సమాజ శ్రేయస్సు



పల్లిపాలెంలో కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- ఎంపీ చింతా అనురాధ
- రూ.2 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభం

ముమ్మిడివరం: దైవానుగ్రహంతోనే సమాజ శ్రేయస్సు పరిఢవిల్లుతుందని ఎంపీ చింతా అనురాధ, టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు ఆకాంక్షించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో రూ.2 కోట్ల ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు, ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కలియగ దైవం వేంకటేశ్వరసామి ఆలయంతో పాటు బహుళ ప్రయోజనాలతో కూడిన కల్యాణ మండపం నిర్మించడం శుభ పరిణామమన్నారు. ఆలయం, కల్యాణ మండపం నిర్మాణ రూపకర్త పెన్మత్స చిట్టిరాజును ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగా భవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స జగ్గప్పరాజు, కాశి బాలమునికుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ పెయ్యల భూలక్ష్మి, కోలా బాబ్జి, కౌన్సిలర్ రెడ్డి హేమ సుందరి, బొంతు సత్యశ్రీనివాస్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలు

అల్లవరం: ఈ-క్రాప్ నమోదు జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. ఈ-క్రాప్ నమోదుపై కోడూరుపాడు సచివాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన శనివారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ దాళ్వా సీజన్‌లో 4,305 ఎకరాల్లోని వరికి ఈ-క్రాప్ నమోదు చేసి 2,422 మంది రైతులకు ఈకేవైసీని నమోదు చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రైతు భరోసా కేంద్రాల్లో ఉంచిన ఈ-క్రాప్ జాబితాపై అభ్యంతరాలను మార్చి 5లోగా వ్యవసాయ సహాయకులకు ఇవ్వాలని సూచించారు. ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అందించే సంక్షేమ పథకాలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. వరి సాగు చేస్తున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అనంతరం రైతు జాబితాలను నోటీసుబోర్డులో ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆకుల శ్రీనివాస్, కార్యదర్శి చిక్కం శ్రీను, వీఆర్ఓ నాగేంద్ర, రైతులు నక్కా రామారావు, కొక్కిరిమెట్టి మహాలక్ష్మి, ఏఏఓ శివమోహన్, వ్యవసాయ సహాయకులు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమ భవనానికి భూమి పూజ

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో రూ.10 లక్షల నిధులతో నిర్మించే నాయీ బ్రాహ్మణ సంక్షేమ భవనానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బుల్లినాని, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

కాట్రేనికోన: బలుసుతిప్ప పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలి షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మూగ జీవి మృత్యువాత పడిందని స్థానిక యువత మండిపడ్డారు. పాడి గేదె మృతి చెందడంతో జీవనోపాధిని కోల్పోయానని గేదె యాజమాని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెను చూసి స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉన్న కారణంగా తమ చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని అయినాపురంలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని, మోకావారిపేట, పులిమేవారిగట్టు, పెదమొట్ట లంక ప్రాంతాల్లో రూ.30 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే జలజీవన్ మిషన్, ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ఆరు వాటర్ ట్యాంకులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఇప్పటికే ఆరు వాటర్ ట్యాంకులు నిర్మించామని మరో ఆరు ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, పెయ్యల భూలక్ష్మి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జీ, జగతా పద్మనాభం, సర్పంచ్ మోకా రామారావు, రెడ్డి హేమ సుందరి, వైస్ ఎంపీపీలు మట్టపర్తి సురేష్, పాము నాగవేణి, ఇందుకూరి సుబ్బరాజు, యనమదల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అయినాపురంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

పొదుపు విలువ తెలుసుకోవాలి



వ్యాసరచన పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు

అమలాపురం టౌన్: విద్యార్థులు ఆర్థికపరమైన అంశాలపై అవగాహనతో పాటు పొదుపు విలువ తెలుసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్‌బాబు సూచించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ వీక్‌లో భాగంగా స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'హౌ బ్యాంక్ ఎసెన్షియల్ ఫర్ స్టూడెంట్స్' అనే అంశంపై శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల కార్యక్రమానికి శ్యామ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. భవిష్యత్‌లో ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా మీ భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవాలని పొదుపు విలువ తెలియజేశారు. బ్యాంక్‌లు జీరో బ్యాలెన్స్ అకౌంట్స్ ఓపెన్ చేస్తున్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాణిజ్య బ్యాంక్‌ల ద్వారా అమలవుతున్న వివిధ స్కీమ్‌ల గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, కె.కాంతి ప్రియ, బి.లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ చెక్‌పోస్టు విధుల నుంచి మినహాయించండి

యానాం: నియోజకవర్గ సరిహద్దుల్లో నిఘా నిమిత్తం ఏర్పాటుచేస్తున్న ఎలక్షన్ చెక్‌పోస్టు విధుల నుంచి మినహాయించాలని కోరుతూ 39 మంది ఉపాధ్యాయులు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం శనివారం అందజేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రతిష్టాత్మకంగా 1వ తరగతి నుంచి సీబీఎస్ఈ కరిక్యులమ్ అమలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో నూతన విద్యా సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. మార్చి నెలలో పరీక్షలు పూర్తయ్యాక విద్యార్థులకు టీసీల జారీ, కొత్త విద్యార్థులు అడ్మిషన్లు ఇవ్వడం తదితర పనులు ఉంటాయన్నారు. ఈ పనుల నేపథ్యంలో తమను చెక్‌పోస్టు విధుల నుంచి మినహాయించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పవన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు తోట వెంకన్న, ఉపాధ్యక్షుడు బి.సత్యశ్రీనివాస్, హబీబున్నీషా, కల్యాణ్‌బాబు, రత్ననాయుడు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

అమలాపురం రూరల్: ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సెర్ప్ ఉద్యోగుల ఫైల్‌ను ఆమోదింపజేసి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ కాకర్లపూడి వెంకటరామిరెడ్డిని సెర్ప్ ఉద్యోగులు కోరారు. శనివారం అమలాపురం విచ్చేసిన ఆయనను కోనసీమ సెర్ప్ ఉద్యోగులు కలిసి తమ సమస్యలు వివరించారు. అనంతరం శాలువాతో ఆయన్ని సత్కరించారు. కార్యక్రమంలో సెర్ప్ జాక్ కోనసీమ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీబీ ప్రసాద్, బి.వర్మ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి

అమలాపురం టౌన్: పట్టణంలో ఉన్న రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హెల్త్ సెంటర్ల వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణ తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 35 పల్స్‌పోలియో కేంద్రాల్లో ఐదేళ్ల లోపు వయసున్న 3,200 మంది చిన్నారులకు తమ వైద్య సిబ్బంది పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నారని చెప్పారు. ఆదివారం పోలియో చుక్కల కేంద్రాలకు రాలేని వారి కోసం సోమ, మంగళవారాల్లో తమ వైద్య సిబ్బంది వారిని గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి మరీ చుక్కలు వేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వెంకటకృష్ణ విజ్ఞప్తి చేశారు. స్థానిక భూపయ్య అగ్రహారం శివారు చల్లావారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటరులో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పల్స్‌పోలియో చుక్కల శిబిరాన్ని ఆదివారం ఉదయం ప్రారంభిస్తారని కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు.